సాక్షి కామారెడ్డి

గురువారం । 29 । మే । 2025



అనుమతి ఒకచోట..

బిచ్కుంద మండలంలో మొరం మాఫియా రెచ్చిపోతోంది. అనుమతి ఒక చోట తీసుకొని మరో చోట తవ్వుకుంటున్నారు.

- 8లో ▸



శిథిలావస్థలో ఓవర్‌హెడ్ ట్యాంక్

బీబీపేటలోని బుర్జు వద్ద ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉంది.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
39.7 /21.6

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ప్రభుత్వాస్పత్రిలో కుమారుడికి టీకా వేయించిన సబ్ కలెక్టర్



బాన్సువాడ : బాన్సువాడ మాతా శిశు సంరక్షణ ఆస్పత్రిలో బుధవారం తన కుమారుడికి టీకా వేసి సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించేందుకు బూస్టర్ డోస్ టీకా వేయించినట్లు తెలిపారు. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రిల్లో వైద్య సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఆస్పత్రి సిబ్బంది పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ఏఎన్ఎం అమృత తదితరులున్నారు.

కొనసాగుతున్న అడ్వాన్స్‌డ్ ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి అర్బన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. ఫస్టియర్ బ్రిడ్జ్ కోర్సు పరీక్షలకు 33 మంది హాల్‌టికెట్లు పొందగా 24 మంది హాజరయ్యారు. సెకండియర్ పరీక్షలకు 9 మంది హాల్ టిక్కెట్లు పొందగా ముగ్గురు మాత్రమే పరీక్ష రాశారు.

నియోజకవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్‌లోని కింగ్స్ కన్వెన్షన్ హాల్‌లో నేడు జరిగే కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ హాజరవుతున్నట్లు తెలిపారు.

విద్యుత్ అధికారులకు సమాచారమివ్వాలి

కామారెడ్డి అర్బన్ : విద్యుత్ స్తంభాల ద్వారా కేబుల్ వైర్లను వేస్తున్న ఆపరేటర్లు విద్యుత్ అధికారులకు సమాచారమివ్వాలని జిల్లా ఎస్ఈ శ్రావణ్‌కుమార్ సూచించారు. బుధవారం ఎస్ఈ తన కార్యాలయంలో వివిధ కేబుల్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైర్లు, కేబుళ్లకు సంబంధించి వివరాలను కచ్చితంగా పేర్కొనాలన్నారు. విద్యుత్ ఆపరేషన్స్ అధికారులు రాజశేఖర్, గోపాల్‌రెడ్డి, కల్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ పోర్టల్‌పై అవగాహన




బాన్సువాడ: భవన నిర్మాణ కార్మికులకు ఈ-శ్రమ పోర్టల్‌పై బుధవారం బాన్సువాడలో కార్మిక శాఖ బాన్సువాడ డివిజన్ సహాయ అధికారి ఇబ్రహీం జుబేర్ అవగాహన కల్పించారు. వివిధ రంగాల్లో పని చేస్తున్న ప్రతి కార్మికుడు ఈ-శ్రమ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని, కార్మిక శాఖ నుంచి గుర్తింపు కార్డులు పొందాలని అన్నారు. పోర్టల్‌లో నమోదు చేసుకుంటే కార్మికులకు రూ. 2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని అన్నారు. బీడీ కార్మికులకు దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్ సతీష్‌రెడ్డి ఉన్నారు.

సాగర్‌లోకి 581 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్(జుక్కల్): రెండు, మూడు రోజుల నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకల్లో వరద నీటి ప్రవాహాలు ప్రారంభమయ్యాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం 581 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు. 17.8 టీఎంసీలకు గాను 5.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్‌లోకి స్వల్ప ఇన్‌ఫ్లో వస్తోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 416.5 మీటర్లు కాగా.. 408 మీటర్ల మేర నీరు నిల్వ ఉంది.

- కామారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తే 54,916 ఓట్లు వేశాం
- ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయండి
- 22వ ప్యాకేజీపై రివ్యూ చేయాలి
- నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులివ్వాలి
- నియోజకవర్గ ప్రజల డిమాండ్



రేవంతన్నా.. కామారెడ్డి వైపు సూడన్నా!

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : 'కామారెడ్డి ప్రజల ఆశీర్వాదంతో కేసీఆర్‌ను ఓడించి తీరుత. కేసీఆర్‌ను ఓడించేందుకే ఇక్కడ పోటీ చేస్తున్న' అని ఎన్నికల ప్రచార సభల్లో ప్రకటించిన ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి తన లక్ష్యాన్ని సాధించారు. తాను గెలవలేకపోయినా, కేసీఆర్‌ను ఓడించడంలో సక్సెస్ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నుంచి పోటీ చేసిన రేవంత్‌రెడ్డికి 54,916 ఓట్లు వచ్చాయి. కొడంగల్ నుంచి వచ్చిన రేవంత్‌రెడ్డిని ఇక్కడి ఓటర్లు ఆదరించిన నేపథ్యంలో సీఎం హోదాలో కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత ఆయనపై ఉందని ఇక్కడి ప్రజలు అంటున్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో నియోజకవర్గంలో ఐదారు పర్యాయాలు పర్యటించిన రేవంత్ రెడ్డికి నియోజకవర్గంలో ప్రధాన సమస్యలపై అవగాహన ఉందని, అలాగే ఇక్కడి వివిధ వర్గాల ప్రముఖులతో పరిచయాలు కూడా ఏర్పడ్డాయని పేర్కొంటున్నారు. తన సొంత నియోజకవర్గం కొడంగల్‌కు నిధులిచ్చినట్టే కామారెడ్డిపై కరుణ చూపాలని కోరుతున్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమీక్ష జరిపి అభివృద్ధికి బాటలు వేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తోంది. జిల్లాలోని మిగతా మూడు నియోజకవర్గాలకు వచ్చినా, కామారెడ్డికి మాత్రం ఇప్పటికీ మంజూరు కాలేదు. దీంతో ఇక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రులుగా గెలుపొందిన వారు తమ నియోజకవర్గాలకు కాస్త ఎక్కువగా నిధులు కేటాయించుకోవడం పరిపాటి. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్, కామారెడ్డి నియోజకవర్గాల నుంచి పోటీ చేశారు. కొడంగల్‌లో గెలిచి కామారెడ్డిలో స్వల్ప తేడాతో ఓడిపోయారు. అప్పటి సీఎం కేసీఆర్‌ను ఓడించి తీరుతా అన్న రేవంత్ రెడ్డి శపథం మాత్రం నెరవేరింది. కామారెడ్డిలో ప్రభావిత ఓట్లు ఇచ్చిన ఇక్కడి ప్రజల రుణం తీర్చుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కొడంగల్ మాదిరిగా కామారెడ్డిని సొంత నియోజకవర్గంగా భావించి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభ్యర్థిస్తున్నారు.

ఇరుకు రోడ్లతో ఇబ్బందులు..

జిల్లాకేంద్రంలో ప్రధాన రోడ్లన్నీ ఇరుకుగా మారిపోయాయి. పెరిగిన జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ జరగలేదు. మాస్టర్ ప్లాన్ ప్రకారం కూడా రోడ్లు లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో రోడ్లను విస్తరించడం ద్వారా ప్రజల ఇబ్బందులు తొలగించాల్సిన అవసరం ఉంది.

పట్టణాన్ని రెండుగా విభజించే రైల్వే లైనుపై వంతెనలు లేక ఇబ్బందులు నెలకొన్నాయి. ఉన్న ఒక్క వంతెన ఇరుకుగా మారింది. అశోక్‌నగర్‌లో రైల్వే గేటు మాటిమాటికీ వేయడం వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

సాగునీరే పెద్ద సమస్య..

కామారెడ్డి నియోజక వర్గంలో ఎలాంటి ప్రాజెక్టులు లేకపోవడంతో రైతాంగం భూగర్భజలాలపైనే ఆధారపడి సేద్యం చేస్తుంటారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రాణహిత-చేవెళ్ల పథకానికి సంబంధించి 22వ ప్యాకేజీ పనుల కోసం కామారెడ్డిలో శంకుస్థాపన చేశారు. ఆయన మరణంతో పనులు ఆగిపోయాయి. 22వ ప్యాకేజీ పనులకు సంబంధించి భూసేకరణకు ఇటీవల కేవలం రూ.23 కోట్లు మంజూరయ్యాయి. అవి ఏమాత్రం సరిపోవు. దాదాపు మూడు వేల ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. భూసేకరణకు మరో రూ.200 కోట్లు అవసరమవుతాయి. అలాగే ప్రాజెక్టు పనులు చేపట్టి పూర్తి చేయాలంటే రూ.2 వేల కోట్లు అవసరమవుతాయని అధికారులు అంటున్నారు. 22వ ప్యాకేజీ పనులపై సీఎం రివ్యూ చేసి అవసరమైన నిధులు కేటాయిస్తేగానీ పనులు ముందుకు కదిలే పరిస్థితి లేదు.

విద్యారంగంలో వెనకడుగే..

నాలుగైదు జిల్లాలకు కూడలిగా ఉన్న కామారెడ్డి పట్టణంలో ఐదు దశాబ్దాల కిందటే డిగ్రీ కాలేజీ ఏర్పాటైంది. రాష్ట్రంలో ఎక్కడాలేని బీటెక్ డెయిరీ, బీఎస్సీ ఫిషరీష్, బీఎస్సీ ఫారెస్ట్రీ వంటి కోర్సులు ఇక్కడ ఉన్నాయి. ఇక్కడ చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. అయితే మారిన పరిస్థితులకు అనుగుణంగా ఉన్నత విద్య అవకాశాలు మెరుగపడలేదు. ముఖ్యంగా డెయిరీ కోర్సుకు సంబంధించి పీజీ కోర్సులు రాష్ట్రంలో కూడా ఎక్కడా లేవు. ఇక్కడ ఎంటెక్ డెయిరీ కోర్సులు ప్రారంభించడానికి కావల్సిన సౌకర్యాలన్నీ ఉన్నాయి. పీజీ కోర్సులు తీసుకురావలసిన అవసరముంది. గత ప్రభుత్వం మెడికల్ కాలేజీ మంజూరు చేసింది. ఇక్కడ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీలతో పాటు మహిళా డిగ్రీ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, ఫుడ్ టెక్నాలజీ వంటి కాలేజీలు ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో మరిన్ని కోర్సులు ప్రవేశపెట్టి అభివృద్ధి చేయాల్సి ఉంది.

జిల్లాకు మూడు సమీకృత గురుకులాలు

విద్యారంగంలో సమూల మార్పులు తీసుకురావడానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక స్కూల్ చొప్పున మంజూరు చేస్తోంది. తొలి విడతలో జుక్కల్‌కు మంజూరవగా.. మద్నూర్‌లో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తాజాగా బాన్సువాడ, ఎల్లారెడ్డిలకు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాన్సువాడకు మంజూరైన పాఠశాలను పోతంగల్‌లో ఏర్పాటు చేయనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. అలాగే ఎల్లారెడ్డికి స్కూల్ మంజూరైనట్టు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావ్ తెలిపారు. రూ.200 కోట్లు విడుదలయ్యాయని, టెండర్లు మిగిలాయని పేర్కొన్నారు. కానీ కామారెడ్డికి గతంలో మోడల్ స్కూల్, ఇప్పుడు ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయకుండా హ్యాండిచ్చారని స్థానిక నేతలు, విద్యార్థులు వాపోతున్నారు.

“ ఆదరించిన ప్రజలకు మేలు చేయాలి



అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి వచ్చి పోటీ చేస్తే ఇక్కడి ప్రజలు ఎంతో ఆదరించారు. తక్కువ సమయంలో కూడా మంచి ఓట్లు వచ్చాయి. నియోజకవర్గ ప్రజలకు మేలు చేయాల్సిన బాధ్యత సీఎంపై ఉంది. ఇక్కడి డిగ్రీ కాలేజీకి వందల ఎకరాల స్థలం ఉంది. యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. ఈ నియోజకవర్గం నాలుగైదు జిల్లాలకు కూడలి.

– క్యాతం సిద్దరాములు, న్యాయవాది, కామారెడ్డి

యూనివర్సిటీ కావాలి



కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి కావలసినంత భూమి ఉంది. అన్ని సౌకర్యాలున్నాయి. ఇక్కడ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. అప్పటి సీఎం కేసీఆర్ ఎడ్యుకేషన్ హబ్ చేస్తానన్నారు. పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, లా, ఉమెన్స్ డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలి. సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి గురించి ఆలోచించాలి. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వాలి.

–ఎల్ఎస్ ఆజాద్, బీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: రాజీవ్ వికాసం పథకంలో రూ.50 వేలు, రూ.లక్ష రుణాలకు లబ్ధిదారుల ఎంపిక బుధవారం లోగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎంపీడీవోలు, ఏపీఎంలు, ఏపీవోలతో రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, వనమహోత్సవం, ఉపాధి హామీ పథకంలో జల సంరక్షణ పనులు తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జల సంరక్షణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వనమహోత్సవం కార్యక్రమానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్, డీఆర్‌డీవో సురేందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

2న మంజూరు పత్రాలు ఇవ్వండి

కామారెడ్డి క్రైం: రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా లబ్ధిదారులకు జూన్ 2న మంజూరు పత్రాలు అందజేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రూ.50 వేలు, రూ.లక్ష రుణాలను జూన్‌లో, రూ.లక్ష నుంచి నుంచి రూ.2 లక్షల రుణాలను జూలైలో, రూ. 2లక్షల నుంచి రూ.4 లక్షల రుణాలను ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో మంజూరు చేయడానికి నిర్దేశించినట్లు తెలిపారు. యూనిట్లు గ్రౌండయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ చందర్, డీఆర్‌డీవో సురేందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, అధికారులు పాల్గొన్నారు.

బాన్సువాడ కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గ పోరు

- మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గం నిరసన
- పోలీసుల పహారాలో కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం



ఏనుగు వర్గం నేతలను సముదాయిస్తున్న సీనియర్ నేతలు

బాన్సువాడ : బాన్సువాడ కాంగ్రెస్ పార్టీలో వర్గ పోరు భగ్గుమంది. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గం నిరసన గళం ఎత్తారు. పోలీసుల పహారాలో అధికార కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఇందుకు బాన్సువాడ శ్రీనివాస గార్డెన్ వేదికగా నిలిచింది. సమావేశానికి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, కైలాస్ శ్రీనివాస్, ఉమ్మడి జిల్లాల అబ్జార్వర్లు వేణుగోపాల్ యాదవ్, సత్యనారాయణగౌడ్‌లు హాజరయ్యారు. ఈ కార్యకర్తల సమావేశానికి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులకు, కార్యకర్తలకు సమాచారం ఇచ్చారు. కానీ మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గంలో ఉన్న పార్టీ మండల అధ్యక్షులు, ఏఎంసీ చైర్మన్, సీనియర్ కార్యకర్తలకు సమాచారం ఇవ్వలేదని ఆ వర్గం కార్యకర్తలు మార్కెట్ కమిటీలో సమావేశమయ్యారు. ఉమ్మడి జిల్లాల అధ్యక్షులకు ఈ విషయాన్ని తెలిపి మార్కెట్ కమిటీకి రావాలని ఏనుగు వర్గం సూచించారు. మానాల మోహన్‌రెడ్డి, కైలాస్ శ్రీనివాస్‌లు నేరుగా శ్రీనివాస్‌గార్డెన్‌కు వచ్చారు. విషయం తెలుసుకున్న ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గం నేతలు మార్కెట్ కమిటీ నుంచి నేరుగా శ్రీనివాస్ గార్డెన్‌కు వచ్చారు. గార్డెన్ వద్ద భారీ సంఖ్యలో ఉన్న పోలీసులు ఏనుగు వర్గం నేతలు సమావేశానికి రాకుండా అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు, సీనియర్ నాయకులు గేటు ముందు బైఠాయించారు. విషయం తెలుసుకున్న సీనియర్ నేతలు ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గం వద్దకు వచ్చి సముదాయించే ప్రయత్నం చేశారు. కొత్తగా పార్టీలో చేరిన వారు తమను అవమానిస్తున్నారని ఏనుగు వర్గం నేతలు ఆరోపించారు. చివరికి వారిని సముదాయించి పంపించేశారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త!

- మార్కెట్‌లో నకిలీ, నాసిరకం విత్తనాల బెడద
- మార్కెట్‌లో పొంచి ఉన్న మోసపూరిత కంపెనీలు
- రైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



మహమ్మద్‌నగర్‌లో విత్తనాల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏవో నవ్య (ఫైల్)

కామారెడ్డి క్రైం : ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. రైతులు పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. విత్తనాలు, ఎరువులను సమకూర్చుకునే పనిలో ఉన్నారు. ప్రతి సీజన్ ప్రారంభంలో అన్నదాతలకు నకిలీ, నాసిరకం విత్తనాలను అంటగట్టి సొమ్ము చేసుకోవాలనే కంపెనీలు, వారికి సహకరించే వ్యాపారులు లేకపోలేరు. మాయమాటలతో రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతూ మోసాలకు పాల్పడుతున్న ఘటనలు ఎక్కడో ఓ చోట వెలుగు చూస్తూనే ఉన్నాయి. కాబట్టి రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే అవకాశం..

కామారెడ్డి జిల్లా పూర్తి వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఇక్కడ ప్రధాన పంటగా వరి సాగవుతుంది. ఈసారి జిల్లా వ్యాప్తంగా 5.24 లక్షల ఎకరాల్లో వివధ రకాల పంటలు సాగు కావచ్చని అధికారులు అంచనా వేశారు. వరి తర్వాత ప్రధానంగా 52 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 35 వేల ఎకరాల్లో పత్తి, 21 వేల ఎకరాల్లో కంది, 5 వేల ఎకరాల్లో మిరప, కూరగాయల పంటలు సాగు కావచ్చనే అంచనాలున్నాయి. ముఖ్యంగా పత్తి, మిరప, కూరగాయల విత్తనాల కొనుగోలు చేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. మహారాష్ట్ర, కర్ణాటక నుంచి నకిలీ విత్తనాలు ప్రవేశించే అవకాశం ప్రతి యేటా ఉంటుంది. పక్కనే ఉన్న నిర్మల్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పరిధిలో నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడిన ఘటనలు ప్రతి సీజన్‌లోనూ వెలుగుచూస్తున్నాయి. మన జిల్లాలో కూడా చాప కింద నీరులా నకిలీ విత్తనాల విక్రయాలు జరుగుతుంటాయనే ఆరోపణలున్నాయి. గతేడాది సైతం జిల్లాలోని పలు చోట్ల వరి, మొక్కజొన్న, పత్తి విత్తనాలు నకిలీవి రావడంతో రైతులు నష్టపోయిన ఘటనలు వెలుగుచూశాయి.

ప్రత్యేక బృందాల ఏర్పాటు..

జిల్లా యంత్రాంగం పోలీసు, వ్యవసాయ శాఖల అధికారులతో జిల్లాలో 5 ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసింది. ఆయా బృందాలు నిరంతరం నకిలీ విత్తనాలపై నిఘా ఉంచుతూనే క్రమం తప్పకుండా వ్యాపారుల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్టు పెడతామని ఇటీవలే కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సైతం ఓ సమావేశంలో హెచ్చరించారు.

“ నిరంతరంగా తనిఖీలు

ప్రత్యేక టాస్క్‌ఫోర్ బృందాలను ఏర్పాటు చేశాం. జిల్లాలోని అన్ని ఎరువులు, విత్తనాల దుకాణాలను నిరంతరంగా పరిశీలిస్తున్నాం. మండలాల అధికారులు కూడా క్రమం తప్పకుండా దుకాణాలను తనిఖీ చేస్తున్నారు. ఎక్కడైనా నకిలీ వితనాలు విక్రయిస్తే వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలి.

– తిరుమల ప్రసాద్, డీఏవో, కామారెడ్డి


పంట నష్ట పరిహారం నిధులు విడుదల

- జిల్లా రైతులకు రూ.74 లక్షలు

కామారెడ్డి క్రైం: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పంటనష్ట పరిహారం విడుదల చేస్తూ ఊరట కలిగించింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రకాల పంటలు నష్టపోయిన 41,361 మంది రైతులకు రూ.51.52 కోట్లు పరిహారం విడుదల చేస్తూ బుధవారం ఉత్తర్వులు విడుదల చేసింది. దీంట్లో కామారెడ్డి జిల్లాలో పంటలు నష్టపోయిన 897 మంది రైతులున్నారు. వారికి రూ.74 లక్షల పంట నష్ట పరిహారం అందించనున్నారు. గడిచిన రెండు నెలల వ్యవధిలో అకాల వర్షాలు, వడగండ్లతో నష్టపోయిన పంటలు, రైతుల వివరాలను అధికారులు సేకరించి ప్రభుత్వానికి నివేదించారు. రాష్ట్ర వ్యాప్తంగా 36,424 ఎకరాల్లో వరి, 3,266 ఎకరాల్లో మొక్కజొన్న, 470 ఎకరాల్లో జొన్న, 6,589 ఎకరాల్లో ఉద్యాన పంటలు, 4,753 ఎకరాల్లో పత్తి, 477 ఎకరాల్లో ఇతర పంటలకు నష్టం వాటిల్లినట్లుగా అధికారులు గుర్తించారు. రెండు నెలలకు సంబంధించిన పంట నష్ట పరిహారం నిధులు విడుదల చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.

సెల్‌ఫోన్ల రికవరీలో జిల్లాకు ప్రథమ స్థానం

- 107 మొబైల్ ఫోన్లు రికవరీ చేశాం
- ఎస్పీ రాజేష్ చంద్ర వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి క్రైం: సెల్‌ఫోన్ల రికవరీలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే ఆందోళనకు గురికావద్దన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేయడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో వారం రోజులుగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో పోగొట్టుకున్న, చోరీకి గురైన 107 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసినట్లు తెలిపారు. వాటి విలువ దాదాపు రూ.15 లక్షలు ఉంటుందన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 3,150 సెల్‌ఫోన్‌లను రికవరీ చేశామని వెల్లడించారు. దీంతో రాష్ట్రంలోని కమీషనరేట్‌లను మినహాయిస్తే కామారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు వెంటనే పాత సిమ్ కార్డును బ్లాక్ చేయించాలని సూచించారు. రికవరీలో ప్రతిభ కనబరిచిన పోలీసులను ఎస్పీ అభినందించారు. రికవరీ చేసిన ఫోన్లు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఆర్ఎస్సై బాల్‌రాజు (8712686114)ను సంప్రదించి ఫోన్లు తీసుకెళ్లాలని సూచించారు.

క్లుప్తంగా

ఆయుష్ ఆస్పత్రుల వద్ద హరిత యోగా కార్యక్రమాలు


మొక్కలు నాటుతున్న అధికారులు

కామారెడ్డి అర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయుష్ డీపీఎం ఆకుల శ్రీకాంత్ అన్నారు. బుధవారం స్థానిక ఎన్జీవోస్ కాలనీలోని ఆయుష్ ఆస్పత్రి వద్ద హరిత యోగా కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడారు. వైద్యులు వెంకటేశ్వర్లు, ప్రకృతి వైద్యులు గుండేల దేవయ్య, మల్లికా జనైడీ, సిబ్బంది రాజలక్ష్మి, సాయిసీల, లింగామూర్తి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలు తొలగించుకోవాలి


రక్తదానం చేస్తున్న షేక్ అహ్మద్

బాన్సువాడ రూరల్: రక్తదానం చేయడంపై ఉన్న అపోహలను తొలగించుకుని, ప్రతి 3 నెలలకు ఓసారి యువకులు రక్తదానం చేయాలని ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్ అన్నారు. బుధవారం బాన్సువాడలోని బ్లడ్‌బ్యాంకులో ఫౌండేషన్ నాయకులు చేసిన రక్తదాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

కామారెడ్డి అర్బన్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగీతో బాధపడుతున్న రోహినా బేగం అనే మహిళకు తెల్లరక్త కణాల సంఖ్య గణనీయంగా పడిపోవడంతో అత్యవసరంగా ఏ పాజిటివ్ ప్లేట్ లెట్లు అవసరం కాగా లింగంపేట్‌కు చెందిన రాజు, రమేష్‌లు స్పందించి మానవత దృక్పథంతో రక్తదానం చేశారని రెడ్ క్రాస్ సోసైటీ జిల్లా సమన్వయకర్త బాలు తెలిపారు. సకాలంలో ఏ పాజిటివ్ రక్తం ఇవ్వడంతో ప్లేట్‌లెట్లు ఎక్కించారని, ప్రాణాపాయం తప్పిందన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమావేశాన్ని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మికులు

ఎల్లారెడ్డి: భవన నిర్మాణ కార్మికుల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎల్లారెడ్డి భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి సమావేశానికి ప్రతి ఒక్క భవన నిర్మాణ కార్మికుడు హాజరు కావాలన్నారు.

కొత్తపల్లిలో కొండ చిలువ



బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లిలో గుమ్మడి చిన్నారెడ్డికి చెందిన పంట భూమిలో పెద్ద కొండ చిలువ ప్రత్యక్షమైంది. దీంతో బుధవారం ఉదయం జిల్లా కేంద్రం నుంచి పాములు పట్టే వారిని పిలిపించి కొండ చిలువను పట్టించారు. కొండ చిలువ చిక్కడంతో ఊపిరి పీల్చుకున్నారు.

అనుమతి ఒకచోట.. తవ్వకం మరో చోట

- రెచ్చిపోతున్న మొరం మాఫియా
- బిచ్కుందలో జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేసిన అధికారులు


జేసీబీ, ట్రాక్టర్లను పట్టుకున్న రెవెన్యూ అధికారులు

బిచ్కుంద(జుక్కల్): మొరం తవ్వకాలకు అనుమతి ఒక చోట పొంది తవ్వకం మరో చోట చేస్తూ బిచ్కుంద మండలంలో మొరం మాఫియా రెచ్చిపోతుంది. అక్రమంగా మొరం తవ్వకాలు జరిపి లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. గత వారం రోజుల నుంచి వందలాది టిప్పర్లు, ట్రాక్టర్లలో ప్రభుత్వ భూమి బిచ్కుంద శివారు తక్కడ్‌పల్లి రోడ్డు లో తవ్వకాలు జరుపుతున్నారు. బుధవారం స్థానికులు తహసీల్దార్ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేయడంతో ఆర్ఐ రవీందర్, సిబ్బందిని పంపించారు. ఒక జేసీబీ, 6 మొరం ట్రాక్టర్లు పట్టుకొని సీజ్ చేశామని తహసీల్దార్ తెలిపారు. బిచ్కుంద శివారులో పెరుగు కిష్టారెడ్డికి చెందిన సర్వే నంబర్ గల 653, 666 పట్టా భూమి 54 గుంటలలో వేయి టన్నుల మొరం తవ్వకాల కోసం మైన్స్ శాఖకు శ్రీరాం అనే వ్యక్తి రూ.20 వేలు సీనరేజ్ చార్జీలు చెల్లించారని తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. మొరం తవ్వడానికి జూన్ 14 వరకు అనుమతి ఉందన్నారు.

గతవారం రోజుల నుంచి అక్కడ తవ్వకుండా తక్కడ్‌పల్లి రోడ్డు ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 814లో మొరం తవ్వి విక్రయిస్తున్నాడు. ఫిర్యాదుతో వెంటనే పరిశీలించగా అనుమతి ఉన్న చోట మొరం తవ్వకుండా, అధికారులను పక్కదారి పట్టించి ప్రభుత్వ భూమిలో మొరం తవ్వుతూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. పట్టా భూమిలో పొందిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని మైన్స్ అధికారులు, బాన్సువాడ సబ్ కలెక్టర్‌కు నివేదిక పంపించినట్లు తహసీల్దార్ తెలిపారు.

విభేదాలు విడిచి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపాలి

- పాత కాంగ్రెస్ కార్యకర్తలకే పదవులు
- నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, పక్కన కైలాస్ శ్రీనివాస్

బాన్సువాడ : విభేదాలు విడిచిపెట్టి కార్యకర్తలందరూ కలిసికట్టుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపాలని నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం బాన్సువాడ శ్రీనివాస గార్డెన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు.స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చేలోపు అధిష్టానం నిర్ణయం మేరకు గ్రామ, మండల స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యవర్గాలను ఎన్నుకుంటామన్నారు. 2017 కంటే ముందు కాంగ్రెస్ పార్టీలో ఉన్న కార్యకర్తలకే గ్రామ, మండల అధ్యక్ష పదవులు కేటాయించాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించిందన్నారు. కాంగ్రెస్ పార్టీపై, సీఎం రేవంత్‌రెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ భరతం పట్టాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు ఉంటుందని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి టీడీపీని వదిలి టీఆర్ఎస్‌లో చేరాకే తెలంగాణ ఉద్యమం ఉధృతమైందని మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి బాన్సువాడకు వచ్చినప్పుడు పోచారం శని పుత్రుడని విమర్శలు చేయడంపై మండిపడ్డారు. పోచారంను విమర్శిస్తే నాలుక చీరేస్తానమని ఆగ్రహం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అబ్జార్వర్లు వేణుగోపాల్‌యాదవ్, సత్యనారాయణగౌడ్, నాయకులు అంబర్‌సింగ్, అలిబిన్‌అబ్దుల్లా, రత్నకుమార్, ఖలేక్, అసద్, కూనీపూర్‌రాజిరెడ్డి, శంకర్, సురేష్‌బాబా, మన్సూర్, మదుసూదన్‌రెడ్డి, బిట్ల సురేష్, దాసరి శ్రీనివాస్, ఎజాస్, శ్రీనివాస్‌గౌడ్, అజీం, అఫ్రోజ్ తదితరులు ఉన్నారు.

> **కాంగ్రెస్ కార్యకర్తలు అన్నదమ్ములా మెదలాలి**
>
> స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, గ్రామాల్లో పాత, కొత్త కాంగ్రెస్ కార్యకర్తలు అన్నదమ్ముల మెదలాలని సూచించారు.
>
> –కైలాస్ శ్రీనివాస్ జిల్లా అధ్యక్షులు కామారెడ్డి.

గ్రామాల్లో కేంద్రం బృందం పర్యటన


కేంద్ర బృందం సభ్యులకు స్వాగతం పలుకుతున్న డిచ్‌పల్లి మండల అధికారులు

డిచ్‌పల్లి/ ఎడపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు, వాటి ప్రయోజనాలను ప్రజలను అడిగి తెలుసుకునేందుకు కేంద్ర బృందాల సభ్యులు జిల్లాలోని పలు గ్రామాల్లో బుధవారం పర్యటించారు. డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి మేజర్ గ్రామం, ఘన్‌పూర్ గ్రామాలను సెంట్రల్ సెక్రెటేరియట్ సర్వీసెస్ ఆఫీసర్లు భానుప్రతాప్ సింగ్, జైపాల్ మౌర్య, దివ్య సింగాల్, హర్విందర్ పర్యటించారు. స్వచ్ఛభారత్ మిషన్, తడి, పొడి చెత్త నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణపై ప్రజలకు ఉన్న అవగాహన, రైతు బీమా పథకాల అమలుపై అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఎడపల్లి మండలం జానకంపేటలో కేంద్ర బృందం సభ్యులు గ్రామంలోని మహిళా సంఘం సభ్యులతో వారికి అందుతున్న రుణాలపై ఆరా తీశారు.

నిరుపయోగంగా కంపోస్ట్ షెడ్



మద్నూర్(జుక్కల్): ప్రభుత్వం తడి చెత్త, పొడి చెత్త కోసం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంపోస్ట్ షెడ్‌లు నిరుపయోగంగా మారాయి. కంపోస్ట్ షెడ్‌లను పంచాయతీ సిబ్బంది వాడకపోవడంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శమిస్తోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో అవి వృథాగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గుంతలయంగా రోడ్డు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామం నుంచి దేమికలాన్‌కు వెళ్లే రోడ్డును బాగుచేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గత 10 ఏళ్ల క్రితం వేసిన తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతల మయంగా మారింది. ప్రతి రోజు ఈ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డు గుండా మండలంలోని కరడ్‌పల్లి, కన్‌కల్, దేమికలాన్ గ్రామాలకు చెందిన ప్రజలు ఎర్రాపహాడ్‌కు వెళ్తుంటారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని కోరుతున్నారు.

అయోధ్య సాధువుల మహారామార్చన యజ్ఞం



నిజామాబాద్ రూరల్: నగర శివారులోని సారంగపూర్‌లో ఉన్న హరిహరాత్మక్ బాలక్ రాంమందిర్ రామానందచార్య ఆశ్రమంలో అయోధ్య సాధువులు బుధవారం మహారామార్చన యజ్ఞం ప్రారంభించారు. జూన్ 5 వరకు కొనసాగనున్న ఈ యజ్ఞంలో పాల్గొనేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సాధువులు తరలిరానున్నారు. అయోధ్యకు చెందిన ప్రేమ్‌దాస్ మహరాజ్(మౌనీబాబా), ఆశ్రమ పూర్వపీఠాధిపతి రమాపతి దాస్ మహరాజ్ పర్యవేక్షణలో యజ్ఞ కార్యక్రమాలు కొనసాగుతాయని ప్రస్తుత పీఠాధిపతి మంగళ్ దాస్ జీ మహరాజ్ తెలిపారు.

సేంద్రియ ఎరువుకు డిమాండ్

- పొలాలకు తరలిస్తున్న రైతులు
- వ్యవసాయాధికారుల సూచన


మద్నూర్‌లో చేనులో వేసుకున్న సేంద్రియ ఎరువు కుప్పలు

మద్నూర్(జుక్కల్): సేంద్రియ ఎరువులైన పశువుల ఎరువు, కోళ్ల ఎరువు, గొర్రెల ఎరువులకు డిమాండ్ పెరగడంతో అధిక ధర పలుకుతుంది. సేంద్రియ ఎరువుల్లో మొక్కకు అవసరమైనా అనేక పోషకాలు ఉన్నట్లు వ్యవసాయ అధికారి రాజు రైతులకు సూచిస్తున్నారు. పశువుల ఎరువులను రసాయన ఎరువులతో పోల్చి చూడగా ఏడాదికి ఒక్క గేదె నుంచి 7 టన్నుల పేడ, 2500 లీటర్ల మూత్రం వస్తుంది. ఒక గేదె పేడలో సాలీనా 27.21 కిలోల నత్రజని (55 కిలోల యూరియాతో సమానం), 13.60 కిలోల భాస్వరం (85 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్‌తో సమానం), 6.8 కిలోల పోటాష్ (12 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌తో సమానం), గేదె మూత్రంలో 29.16 కిలోల నత్రజని, 39.56 కిలోల పొటాష్, కొద్ది మొత్తంలో భాస్వరం ఉంటాయి.

ఏ పంటకైనా ఎలాంటి రసాయన ఎరువులు ఉపయోగించకుండానే పశువుల ఎరువు ఉపయోగించి దిగుబడి అధికంగా పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

లారీ కోడి ఎరువు రూ.12–14 వేలు

రైతుల నుంచి డిమాండ్ పెరగడంతో లారీ కోడి ఎరువు రూ.12–14 వేల మధ్య ఉంది. పశువుల ఎరువు లారీకి రూ.15 వేల నుంచి 16 వేల పైగా చేరింది. గొర్రెల ఎరువు సైతం రూ.9–10 వేల వరకు ఉంది. ప్రస్తుతం పశువుల స్థానంలో ఆధునిక యంత్రాలు రావడంతో ఎరువు దొరకని పరిస్థితి నెలకొంది. ప్రతి రైతు బయటి ప్రాంతాల నుంచి తీసుకవచ్చే సేంద్రియ ఎరువులపైనే ఆధారపడడంతో డిమాండ్ ఏర్పడింది.

షట్టర్లు లేక చెరువు నీరు ఖాళీ

- ఆయకట్టును ముంచెత్తిన చెరువు నీళ్లు
- తూములకు ఇసుక బస్తాలు అడ్డుకట్టగా వేసిన రైతులు

నిజాంసాగర్(జుక్కల్): వరుణుడు కరుణించినా.. అధికారులు కరుణించకపోవడంతో ఆయకట్టు ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువు నీళ్ల ఆయకట్టు భూములను ముంచెత్తుతూ పరుగులు తీస్తుండటంతో బుధవారం నర్వ గ్రామ రైతులు కదం తొక్కారు. ఇసుక బస్తాలను అడ్డుకట్టగా వేసి సాగు నీరు వృథా కాకుండా కాపాడుకున్నారు. మహమ్మద్ నగర్ మండలం నర్వ శివారులోని పాత చెరువు తూములకు షట్టర్లు లేకపోవడంతో నీరు ఖాళీ అవుతోంది. చెరువులోకి వచ్చిన వరద నీరు.. వచ్చింది వచ్చినట్లుగా తూముల ద్వారా వృథాగా పోతోంది. ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా రైతులు సొంతంగా ఇసుక బస్తాలను అడ్డు కట్టగా వేసుకున్నారు. నర్వ పాత చెరువు కుడి, ఎడమ పంట కాలువల తూములకు షట్టర్లు లేకపోవడంతోనే సాగు నీరు వృథాగా పోతోందని అధికారులు స్పందించి షట్టర్లు బిగించాలని రైతులు కోరుతున్నారు.


చెరువు తూముల వద్ద ఇసుక బస్తాలను అడ్డుగా వేసుకుంటున్న రైతులు,


వేసిన ఇసుక బస్తాలు

బీబీపేట బస్టాండ్‌లో తాగుబోతుల వీరంగం

- మద్యం మత్తులో ఇద్దరు అన్నాదమ్ముళ్ల ఘర్షణ
- ప్రయాణికులకు ఇక్కట్లు



గాయాలపాలైన గణేశ్, రమేశ్

బీబీపేట: మద్యం మత్తులో ఇద్దరు అన్నాదమ్ముళ్లు వీరంగం సృష్టించిన ఘటన బీబీపేట బస్టాండ్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రాంరెడ్డిపల్లికి చెందిన గణేశ్, రమేశ్‌కు గ్రామంలో ఎలాంటి స్థలం లేకపోవడంతో మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో తల్లితో కలిసి ఉంటున్నారు. వారి తల్లి భిక్షాటన చేస్తూ అన్నం పెడుతోంది. బుధవారం మధ్యాహ్నం మద్యం మత్తులో ఉన్న వీరు బస్టాండ్‌లో ఘర్షణ పడ్డారు. కర్రలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకొన్నారు. ఈ ఘటన చూసిన ప్రయాణికులు భయంతో కొద్ది దూరం పారిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వారిని ఆస్పత్రికి తరలించారు. నిత్యం మద్యంలో బస్టాండ్‌కు వచ్చే మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, వారిని వేరే చోటుకు తరలించాలని స్థానికులు కోరారు.

నాలుగేళ్లకే నూరేళ్లు..

- అమ్మమ్మ ఇంటికి వచ్చి కానరాని లోకాలకు..
- కొత్తపల్లిలో నీటి గుంతలో పడి బాలుడి మృతి


యశ్వంత్ (ఫైల్)

మాచారెడ్డి: ఇంటి బయట ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడు నీటి గుంతలో పడి మృతిచెందిన ఘటన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం కొత్తపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన భూమ శ్రీలత–సందీప్‌ల రెండో కుమారుడైన యశ్వంత్(4)ను రెండు రోజుల క్రితం అమ్మమ్మ బరిగె నర్సవ్వ కొత్తపల్లెకు తీసుకొచ్చింది. బుధవారం సాయంత్రం బాలుడు ఆడుకుంటూ నీటి గుంతలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గ్రామానికి చేరుకొని గుండెలవిసేలా విలపించారు. కొడుకా నీకు అప్పుడే నూరేళ్లు నిండాయా అంటూ ఆ తల్లి రోదించిన తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించాయి. గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

సాక్షి క్లాసిఫైడ్స్
SERVICES
BUSINESS SERVICES
■ సిరి అసోసియేట్స్ హౌస్ మార్టిగేజ్ పర్సనల్ ఓపెన్ ప్లాట్స్ రేకుల & గుణ పెంకు ఇళ్లపై సిబిల్ లేకున్నా రుణాలు ఇప్పించబడును. సెల్: 9666142226.
[SCA25003998]
4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/- రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949
గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


నవీన్ మృతదేహం

సిరికొండ: మండలంలోని కొండూర్‌లో విద్యుత్ తీగలు తగిలి ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై ఎల్ రామ్ తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండలం సుద్దులం గ్రామానికి చెందిన వేల్పూర్ నవీన్(29) అనే యువకుడు వడ్రంగి పని చేయానికి తన మామ అయిన రవి వద్దకు కొండూర్ గ్రామానికి వచ్చాడు. బుధవారం గ్రామ సమీపంలో మూత్ర విసర్జనకు వెళ్లాడు. కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో ఓ నిండు ప్రాణం బలైందని గ్రామస్తులు వాపోయారు. వారి నిర్లక్ష్యాన్ని నిరసిస్తు గ్రామస్తులు రహదారిపై రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకొని ఘటన స్థలానికి వచ్చిన ఏఈ చంద్రశేఖర్, ట్రాన్స్‌కో సిబ్బందిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై ఎల్ రామ్ గ్రామస్తులను సముదాయించడంతో ఆందోళన విరమించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ట్రాన్స్‌కో అధికారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని దుబ్బ ప్రాంతంలో లారీ ఢీకొని ఒకరు మృతి చెందినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బకు చెందిన సుంకరి నర్సయ్య(68) బుధవారం ఉదయం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఓ వ్యక్తి అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని రైలు రాకను గమనించి పట్టాలపై తల పెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కామారెడ్డి రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి చేతులపై త్రిషూలం, గాయత్రి పచ్చబొట్లు ఉన్నాయి. టీషర్ట్, షార్ట్ ధరించి ఉన్నాడు.

వ్యక్తిగత ఆనవాళ్లు లభించలేదు. మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఎవరైనా మృతుడి ఆనవాళ్లు తెలిస్తే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని రైల్వే హెడ్ కానిస్టేబుల్ హన్మాండ్లు కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



లింగంపేట: మండలంలోని పొల్కంపేట శివారులోని పెద్దవాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను బుధవారం సాయంత్రం పట్టుకొని సీజ్ చేసినట్లు ప్రొబేషనరీ ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. ఎక్కపల్లి గ్రామానికి చెందిన నీల శంకర్, ల్యాగల గోపాల్ ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌లో జైలు శిక్ష

మోపాల్: మండల కేంద్రంలో ఈనెల 25న నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనం నడిపిన కులాస్‌పూర్ తండాకు చెందిన మూడ్ గణేశ్‌కు రెండ్రోజుల జైలు శిక్ష విధిస్తూ ప్రత్యేక ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి నూర్జహాన్ బేగం తీర్పు ఇచ్చినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ బుధవారం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కఠిన శిక్షలు విధిస్తామని పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఎస్సై సూచించారు.

తండ్రి, కూతుళ్ల మధ్య వివాదం పరిష్కారం



బోధన్: పట్టణ కేంద్రంలోని దళిత వాడకు చెందిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు పరమేశ్ కుమార్తె వైష్ణవి రెండేళ్లుగా జిల్లా కేంద్రంలోని బాల సదన్‌లో ఉంటోంది. తన తండ్రి ఆలనా, పాలన పట్టించుకోవడం లేదని బోధన్ పట్టణ కేంద్రంలోని మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ఆశ్రయించి ఆదుకోవాలని కోరింది. బుధవారం ఈ కేంద్ర నిర్వాహకులు తండ్రి, కూమార్తెను పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. తన నెలసరి వేతనంలో సగభాగం, ఉన్న ఎకరం పొలంలో సగభాగం కుమార్తెకు ఇచ్చేందుకు తండ్రి పరమేశ్ అంగీకరించాడు. ఈ నేపథ్యంలో స్థానిక కోర్టులో అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్ వద్దకు ఇరువురిని తీసుకెళ్లగా ఇరువురి అంగీకారం మేరకు అవార్డు ప్రకటించి వారికి అందించారు. ప్రస్తుతం వైష్ణవి తండ్రి మేనత్త వద్ద ఉంటోందని కేంద్ర నిర్వాహకులు, పారలీగల్ వలంటీర్ పద్మాసింగ్ తెలిపారు.

జీజీహెచ్ ఏడీగా శ్రీనివాస్‌ప్రసాద్

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఏడీగా శ్రీనివాస్‌ప్రసాద్ జిల్లాకు రానున్నారు. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ ప్రసాద్ పదోన్నతిపై జీజీహెచ్ ఏడీగా రానున్నారు. ప్రస్తుతం జీజీహెచ్ ఇన్‌చార్జి ఏడీగా డాక్టర్ రాజశేఖర్ విధులు నిర్వర్తిస్తున్నరు. జూన్ మొదటి వారంలో పూర్తిస్థాయి ఏడీ రానున్నారు.

కాలువతో భక్తులకు ఇబ్బందులు



ఎల్లారెడ్డి: పట్టణంలోని అయ్యప్ప ఆలయం ముందు తవ్విన కాలువతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయం ముందు తవ్విన కాలువతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని భక్తులు పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు.

కుక్కల దాడిలో జింక మృతి

రుద్రూర్: పొతంగల్ మండలం టాక్లీ శివారులో బుధవారం జింకల గుంపు నుంచి దారి తప్పి వచ్చిన ఓ జింకపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ సెక్షన్ అధికారి సురేశ్ గ్రామానికి చేరుకొని జింక కళేబరాన్ని అటవీ ప్రాంతంలో దహనం చేశారు. మంజీరా పరివాహక ప్రాంతంలో ఇటీవల జింక పిల్లలు మృతి చెందుతున్నాయి. వారం రోజుల్లో సోంపూర్, టాక్లీ, యాద్గార్‌పూర్ గ్రామాల్లో కుక్కల దాడిలో నాలుగు జింకలు మృత్యువాత పడ్డాయి. మంద నుంచి దారి తప్పిన జింక పిల్లలు గ్రామ శివారుల్లోకి రావడంతో కుక్కలు దాడి చేస్తున్నాయి. వారం రోజులుగా వర్షాలు పొలాల్లో బురద ఉండడం వల్ల జింక పిల్లలు పరిగెత్తలేకపోతున్నాయి. దీంతో అవి కుక్కల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. మూగ జీవాలను కాపాడాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.